ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -336 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 24 మార్చి 2026



# ఉక్కు శకం

## అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన



### 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను తీసుకొచ్చాం...

రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయనున్న పరిశ్రమ

20 నెలల్లోనే ప్రాజెక్టును సాకారం చేశామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అనకాపల్లి,మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -** ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో.






## బాబు విజన్ వల్లే పెట్టుబడులు

ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్

ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్

రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుపై హర్షం

# 5 రోజులు యుద్ధాన్ని ఆపేస్తున్నాం

: డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన


5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన

ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన

**న్యూఢిల్లీ,మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -** పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు.

మిగతా 2లో.



# యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

## లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -** పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా

మిగతా 2లో.






2లో.

## రైలు ప్రమాదాలకు కవచ్ అడ్డుకట్ట..

కీలక మార్గంలో సేవలు ప్రారంభం

ఢిల్లీ-హౌరా కారిడార్‌లో అందుబాటులోకి వచ్చిన ‘కవచ్‘ వ్యవస్థ

ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ మధ్య 190 కిలోమీటర్ల మేర సేవలు ప్రారంభం

ప్రమాదాలను నివారించి, గంటకు 160 కి.మీ. వేగాన్ని సాధ్యం చేసే టెక్నాలజీ

# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!



సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని పెంచాలని ఆదేశం

ప్రతి ఇంటికీ పైప్డ్ గ్యాస్ కనెక్షన్ ఇచ్చేలా కార్యాచరణకు సూచన

అకాల వర్షాల పంట నష్టంపై మార్చి 26 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం

**అమరావతిమార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం

మిగతా 2లో.

## విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు

తెలంగాణ మంత్రివర్గం ఆమోదం

పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు ఆమోదం

తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకుంటే వేతనాల్లో కోత




2లో.

# దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి

కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన వైఎస్ షర్మిల

వివేకా హత్య కేసును పక్కదారి పట్టించేందుకే ఈ గొడవ అని ఆరోపణ

దమ్ముంటే జగనే నేరుగా మాట్లాడాలంటూ సవాల్

విజయమ్మ లేఖలోని సంతకం నిజమని.. వైసీపీ ప్రచారం అబద్ధమని వెల్లడి

వైసీపీ నేతలపై అత్యంత కఠిన పదజాలంతో విరుచుకుపడ్డ షర్మిల



**అమరావతి (రిపబ్లిక్ న్యూస్) -** తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి

మిగతా 2లో.

# ‘బియ్యం’ రాజకీయం



ఎగుమతులపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు..

దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!

సీబీఐ, ఐడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అడ్వైజర్ గా ఎలా నియమించుకుంటారని హరీశ్ ప్రశ్న

ఎగుమతులు 22,750 టన్నుల వద్దే ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్న

హరీశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్న ఉత్తమ్

ఎగుమతుల్లో ప్రేమ్ చంద్ కు సంబంధం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -** రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.

మిగతా 2లో.



## 5 రోజులు యుద్ధాన్ని ఆపేస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**

“గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను“ అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

**మొదటిపేజీ తరువాయి**

వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## అసెంబ్లీలో ‘బియ్యం‘ రాజకీయం

**మొదటిపేజీ తరువాయి**

ఈ వ్యవహారంపై తక్షణమే ‘హౌస్ కమిటీ’ వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు.ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు.హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## రైలు ప్రమాదాలకు కవచ్ అడ్డుకట్ట..

**న్యూఢిల్లీ,మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -**

రైలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, వేగవంతంగా మార్చే దిశగా భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ-హౌరా కారిడార్‌లోని ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ సెక్షన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ‘కవచ్‘ ఆటోమేటిక్ రైలు భద్రతా వ్యవస్థను సోమవారం విజయవంతంగా ప్రారంభించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మధ్య సుమారు 190 కిలోమీటర్ల మార్గంలో ఈ వ్యవస్థను యాక్టివేట్ చేశారు. రైలు నంబర్ 14163 ద్వారా ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురాగా, జనరల్ మేనేజర్ స్వయంగా సుబేదార్‌గంజ్ నుంచి మనౌరీ స్టేషన్ వరకు ఫుట్‌ప్లేట్ తనిఖీ నిర్వహించి పనితీరును సమీక్షించారు. డివిజనల్, హెడ్ క్వార్టర్స్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘మేక్ ఇన్ ఇండియా‘లో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ‘కవచ్‘ వ్యవస్థ, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి రూపొందించబడింది. లోకో పైలట్ పొరపాటున రెడ్ సిగ్నల్ దాటినా, ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి రైలును నిలిపివేస్తుంది. రైలు వేగాన్ని, సిగ్నళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడం సాధ్యమవుతుంది.తొలి దశలో చౌరీ చౌరా ఎక్స్‌ప్రెస్‌తో సహా 8 జతల రైళ్లకు ఈ సేవలను అందిస్తారు. రాబోయే నెలల్లో వందే భారత్ సర్వీసులతో పాటు మరిన్ని రైళ్లకు దీన్ని విస్తరించనున్నారు. ఈ వ్యవస్థను ప్రారంభించడానికి ముందు, రైల్వే శాఖ విస్తృతమైన ట్రయల్స్ నిర్వహించింది. వ్యాప్-7 ఇంజిన్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 20 కోచ్‌ల వందే భారత్ రైలుతో ట్రయల్స్ జరిపి, విశ్వసనీయతను నిర్ధారించుకున్నారు. 20,000 కిలోమీటర్లకు పైగా ప్యాసింజర్ ట్రయల్స్ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా కారిడార్‌లలోని కీలక సెక్షన్లతో కలిపి 1,450 కిలోమీటర్ల మార్గంలో ‘కవచ్‘ వెర్షన్ 4.0ను ఏర్పాటు చేశారు. ‘మిషన్ రఫ్తార్‘లో భాగంగా తదుపరి దశలో ఘజియాబాద్-తుండ్లా సెక్షన్‌లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

## విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం

**హైదరాబాద్ మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) -**

తెలంగాణ మంత్రివర్గం కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేషపూరిత నేరాల నిరోధక బిల్లును (హేట్ స్పీచ్) మంత్రివర్గం ఆమోదించింది. మతసామరస్యానికి భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు.దీనితో పాటు సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లలు మద్దతుగా ఉండాలనే లక్ష్యంతో పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. తల్లిదండ్రులను సరిగ్గా ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని నిర్ణయించారు. వారి వేతనం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు నేరుగా తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకురానున్నారు.ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వపరంగా జరగాల్సిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం తీసుకువచ్చే బిల్లులకు ఆమోదం తెలిపింది.

# ఉక్కు శకం



**మొదటిపేజీ తరువాయి**

అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ‘ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

# దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి

**మొదటిపేజీ తరువాయి**

తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం**

వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. “నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు,“ అని షర్మిల విమర్శించారు.

తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు.

**విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి**

తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. “విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి“ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు.

**దమ్ముంటే జగనే మాట్లాడాలి**

ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. “ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?“ అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు.

**వైసీపీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు**

రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు. ఫ్రంట్ పేజీలో రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో వేసుకుని సత్యమేవ జయతే అని చెప్పుకునే సాక్షి పత్రికకు నిజం పట్ల గౌరవం లేదని విమర్శించారు. జగన్‌కు నిజం వైపు నిలబడే ధైర్యం లేకపోవడం వల్లే తన పార్టీలోని నాయకులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాళ్లను నాయకులు అనాలో, కుక్కలు అనాలో మీరే అనుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జగనే అని, ఆయన దర్శకత్వంలోనే ఈ నాటకం నడుస్తోందని ఆమె ఆరోపించారు.

# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

**మొదటిపేజీ తరువాయి**

చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు.

నిలిచిపోయిన శ్రీకాకుళం - కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ‘నేచురల్ గ్యాస్ పాలసీ’ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల




సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు.

**పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక**

అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస**

టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యే నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తిరుమలలో క్యూలైన్ల నిర్వహణ మెరుగుపడిందని, భక్తుల నిరీక్షణ సమయం తగ్గి దాదాపు 20 శాతం అదనపు దర్శనాలు సాధ్యమయ్యాయని వివరించారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ప్రసాదం నాణ్యత పెరిగిందని, భక్తులు, శ్రీవారి సేవకుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన శాఖలు కూడా మెరుగైన ప్రజా సేవల కోసం ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు.

ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచేలా చూడాలని, ఇందుకు పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచాలని, ప్రభుత్వ శాఖలు డేటాను సమర్థంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ 27వ వార్డు పరిధిలో శ్రీరామ కాలనీలో మురుగునీరు పోవడానికి కాలువలు సిసి రోడ్లు వెయ్యాలి

### భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్

**కర్నూలు ప్రతినిధి, మార్చి 23, (పూజారి పబ్లిక్ న్యూస్)**
కర్నూలు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్27వ వార్డుపరిధిలో శ్రీరామ కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివాసముంటున్న వీరికి మురుగు నీరు పోవడానికి కాలువలు సిసి రోడ్లు వెయ్యాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి నగర సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు సోమవారం రోజు ఉదయం కలెక్టర్ ఆఫీస్ లోని స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా వారు కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ తో మాట్లాడుతూ కర్నూలునగరంలో 52 వార్డులు ఉన్నాయి అందులో భాగంగానే గుత్తి పెట్రోల్ బంక్ సమీపాన శ్రీరామ కాలనీ ఉన్నది ,ఈ కాలనీలో80/144బిషి &80/144-7 ఈ



ఇంటినెంబరు గల సిరీస్ లో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయిఅని ఇక్కడ కొన్ని సంవత్సరాలు నుంచి జీవనం సాగిస్తూ నివసిస్తున్న విరికి మౌలిక వసతులు లేవుఅని మురుగునీరు పోవడానికి కాలువలు లేక రోడ్డు అంతా బురద మయంగా మారింది కారణం మురుగు నీరు పోవడానికి కాలువలు లేనందున ప్రతినిత్యం ఇక్కడి ప్రజలు నడిచే దారి మీద మురుగునీరు చేరి మురుగు గుంతల గా మారింది ఈ గుంతలలో ఈగలు దోమలు పందులు చేరి ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు డెంగు మలేరియా చర్మ వ్యాధులు రావడానికి కారణాలవుతున్నాయిఅని మరియు వర్షం వచ్చిందంటే ఇక్కడ అంతా ఒక చిన్న నీటి కుంటలుగా మారినాయి అందులో పాములు వివిధ రకాల పురుగులు ఉండి ఇల్లు లోకి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయని కొన్ని సందర్భాలలో ఇంటికి పోయే మార్గంలో కింద పడిన సందర్భాలు చాలా ఉన్నాయిఅని ఏదైనా పెళ్లిళ్లకు పండగలకు స్కూళ్లకు ఆసుపత్రులకు కూరగాయలు కిరాణం సరుకులు తెచ్చుకోవాలంటే నరకయాతన పడుతున్న ఈ ప్రజల సమస్య తీరాలంటే ఈ శ్రీరామ కాలనీ కి మురుగు నీరు పోవడానికి మురుగు కాలువలు సిసి రోడ్లు వేసి ఇక్కడ నివసిస్తున్న ప్రజల సమస్యలు నెరవేరాలని అని వివరించారు అనంతరం జెసి గిడ్డయ్య చారిషరీఫ్ నగర్ సోమన్న అఖిలు మొదలగువారు పాల్గొన్నారు

# భగత్ సింగ్ 95వ వర్ధంతి ఘన నివాళులు

**గుత్తి మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి పట్టణం నందు, భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ వర్ధంతి, సందర్భంగా జన విజ్ఞాన వేదిక, మరియు భగత్ సింగ్ బోస్ కమిటీ, సిపిఐ, ఎమ్మార్పీఎస్, పెన్షనర్స్, ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించడం జరిగినది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న మాట్లాడుతూ, భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణ త్యాగం, చేసిన మహా వ్యక్తి అని స్వాతంత్రం రావడానికి ముఖ్య వ్యక్తి అని తెలుపడం జరిగినది. అదేవిధంగా భగత్ సింగ్ బోస్ కమిటీ వ్యవస్థాపకులు జగన్ మాట్లాడుతూ, నేటి యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకోవాలని తెలపడం జరిగినది. అదేవిధంగా జన విజ్ఞాన వేదిక నాయకులు పామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి , రంగనాథ్, శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు ,సుఖదేవ్ యొక్క త్యాగాలను తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రమేష్, భగత్ సింగ్ బోస్ కమిటీ రంగస్వామి, ఎమ్మెస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ నిజాముద్దీన్, శ్రీ సాయి జూనియర్ కళాశాల కాంతారెడ్డి, గైడ్ రమేష్, హెచ్ఎం ఓబుల్ రాజు, ఉపాధ్యాయులు షామెల్ ప్రతాప్ కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, సెక్రెటరీ రామ్ మోహన్,లక్ష్మి నారాయణ రెడ్డి, నారాయణ శెట్టి, దేవదాస్,రామ్ దాస్,మద్దులేటి, ఓబులేసు, నరసింహులుగుత్తి, సిపిఐ మండల కార్యదర్శి జి రామదాసు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నజీర్.సిపిఐ మండల సహయ కార్యదర్శులు నరసింహయ్య.వెంకట్ రాముడు.సీనియర్ నాయకులు షఫీ.కెవిపిఎస్ మండల నాయకులు మల్లికార్జున.మాల మహానాడు నాయకులు బండల రామాంజనేయులు. రంగా, తదితరులుదపాల్గొన్నారు




# దేశభక్తికి ప్రతిరూపాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్

### వారి ఆశయ సాధనకు విద్యార్థులు, యువకులు కృషి చేయాలి: కె. రామాంజనేయులు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)**
స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ థాపర్ ల ఆశయాలను కొనసాగించేందుకు విద్యార్థులు, యువకులు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు పిలుపునిచ్చారు.వారి 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం సి.ఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ, భగత్‌సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాలు చేసిన గొప్ప విప్లవకారుడని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాకుండా, సమానత్వం కలిగిన సమాజం కోసం ఆయన పోరాడారని గుర్తుచేశారు. భగత్‌సింగ్ వంటి మహనీయుల చరిత్రను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వం మత, కుల విభేదాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ పరిస్థితులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

ఇతర వక్తలు మాట్లాడుతూ, భగత్‌సింగ్ కేవలం 23 ఏళ్ల వయస్సులోనే దేశం కోసం తన ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. ఆయన ఇచ్చిన "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదం ఇప్పటికీ యువతలో స్ఫూర్తిని నింపుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, సిపిఐ మరియు ప్రజానాట్యమండలి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హోంగార్డ్స్‌కు వెల్ఫేర్ ఫండ్ చెక్కుల పంపిణీ

### కర్నూలులో ఇద్దరు హోంగార్డ్స్‌కు రూ.20 వేల మెడికల్ గ్రాంట్ కమాండెంట్ మహేష్ కుమార్ అందజేత





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)** కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం ఇద్దరు హోంగార్డ్స్‌కు అందజేశారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది.సదరన్ రీజియన్ హోంగార్డ్ కమాండెంట్ యం. మహేష్ కుమార్ హోంగార్డ్ కమాండెంట్ కార్యాలయంలో ఈ చెక్కులను పంపిణీ చేశారు. మెడికల్ గ్రాంట్ కింద కర్నూలు యూనిట్‌కు చెందిన హోంగార్డు పి. సురేష్ కుమార్‌కు రూ.10,000, మహిళా హోంగార్డు వి. భారతి కి రూ.10,000 చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇంచార్జ్ ఎస్.ఎల్. కాంతరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీమతి కె. మాధవి రాణి, పోలీసు సిబ్బంది మరియు హోంగార్డ్స్ పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం పోరాడుదాం

### :- సిఐటియు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు



**పాములపాడు మార్చి-23 రిపబ్లిక్ న్యూస్:-** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్ సింగ్ పేల్చింది బాంబు కాదని ఆయన పలికించిన ఇంక్విలాల్ జిందాబాద్ అనే నినాదం అని భారత దేశ యువతకు విప్లవ స్ఫూర్తిని ఇచ్చి చరిత్రలో నిలిచారని సిఐటియు మండల కార్యదర్శి మేకల రాజు, సిపిఎం మండల కార్యదర్శి డి.స్వామన్న అన్నారు. మండల కేంద్రమైన పాములపాడులోని, సిపిఎం పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో పెట్టుబడి దారి సామ్రాజ్యవాదం తన రూపును మార్చుకుందని నేటి సమాజంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, అవినీతి రూపంలో దేశం అంతర్గతంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఇలాంటి తరుణంలో భగత్ సింగ్ జీవితం యువతకు గొప్ప సందేశం ఇస్తుందన్నారు. ఆయన చూపించిన ధైర్యం నిబద్ధత త్యాగం నేటి యువతరానికి కూడా ప్రేరణ ఇచ్చిందని వారు కొనియాడారు సమాజంలో అన్యాయం జరిగితే ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. అవినీతి అసమానత అజ్ఞానం వంటి సమస్యలను ఎదుర్కొనే బాధ్యత యువతపై ఉందని ఆయన బలంగా నమ్మాడన్నారు. భగత్ సింగ్ చెప్పిన సమ సమాజ స్థాపన భావన ఎంతో కీలకమైందని అది స్వాతంత్ర ఉద్యమంలో విప్లవస్ఫూర్తిని రగిలించిందన్నారు. ప్రతి భారతదేశ పౌరుడికి ఆర్థిక స్వేచ్ఛ, కూడు-గూడు దొరికినప్పుడే అసలైన స్వరాజ్యం అని నమ్మారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేత సాయి కృష్ణ, సిపిఎం పార్టీ నాయకులు డి.రంగస్వామి, టీ. చిన్న నాగేంద్రుడు, రామక్రిష్ణ, మాల మహానాడు నాయకులు బేతి పుల్లయ్య, సోషల్ మీడియా ప్రతినిధులు ఎస్.షర్ఫుద్దీన్ అలీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అవసరం

### డా. పి. చంద్రశేఖర్ -ప్రతి మెడికల్ కాలేజీకి స్పోర్ట్స్ అభివృద్ధికి రూ.10 లక్షలు కర్నూలు మెడికల్ కాలేజీలో సమీక్ష






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)**
వైద్య విద్యార్థులు కేవలం చదువుతో పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్ట్స్‌లో కూడా చురుకుగా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ పేర్కొన్నారు.సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో జరిగిన అధికారిక పర్యటనలో భాగంగా కళాశాల స్పోర్ట్స్ కార్యకలాపాలపై ప్రిన్సిపల్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు, వైద్య విద్యార్థులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనడం ద్వారా ఇతర కాలేజీల విద్యార్థులతో పోటీ పడే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీంతో వ్యక్తిగత నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. శారీరక దారుఢ్యం ఉన్నప్పుడే విద్యార్థులు జీవిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలరని పేర్కొన్నారు.కర్నూలు మెడికల్ కాలేజీ తన మాతృసంస్థ అని గుర్తుచేసుకున్న ఆయన, ఇటీవల యూనివర్సిటీ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కళాశాలల్లో స్పోర్ట్స్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతి సంవత్సరం రూ.10 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదనంగా నాణ్యమైన స్పోర్ట్స్ సామగ్రి కొనుగోలుకు రూ.2 లక్షలు అందజేస్తామని తెలిపారు.అలాగే కళాశాలల్లో తలెత్తే సమస్యలను అంతర్గతంగా పరిష్కరించుకోవాలని, బయటి జోక్యంతో సమస్యలు పెరుగుతాయని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ & ప్రిన్సిపల్ డా. కే. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ, కేఎంసీ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, ఇప్పటికే రూ.3 లక్షలతో స్పోర్ట్స్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వీసీ సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా. త్రిమూర్తులు, వైస్ ప్రిన్సిపల్ డా. రేణుక, డా. శ్రీరాములు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. లక్ష్మి, డా. నాగేశ్వరరావు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు, పీజీ, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఆద్వర్యం లో నర్సరీ పరిశీలన





**చిప్పగిరి, మార్చి, 23,( రిపబ్లిక్ న్యూస్)**
విద్యార్థిని లకు విద్యతో పాటు మొక్కలు,వాటి ఉపయోగాల పై క్షేత్ర స్థాయి లో పరిశీలించినారు. హాలహర్వి మండలం కేజీబీవీ ప్రిన్సిపల్ పద్మావతి ఆద్వర్యం లో సోమవారం హాలహర్వి కేజీబీవీ పాఠశాలలో 6,7,8వ తరగతి విద్యార్థిను లకు వృత్తి విద్యలో భాగంగా ఒకేషనల్ కోర్స్ లో భాగంగా ఒకేషనల్ ట్రైనర్ జి.సునీత ఆలూరు మండలం అరికెర తండా గ్రామం లో విద్యార్థిని నర్సరీ విజిట్ ను సందర్శించి మొక్కల యొక్క అవశ్యకతను విద్యార్థినిలకు అవగాహన కల్పించారు,మొక్కలు వాతావరణం లో ఏర్పడ్డ కాలుష్యం ను నియంత్రిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ హారిక, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# కర్నూలులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

### అక్రమ పార్కింగ్, రహదారి ఆక్రమణలపై దృష్టి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)**
కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ జె. బాబు ప్రసాద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మరియు మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా ఈ చర్యలు అమలు చేశారు.నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలైన కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా రహదారులను ఆక్రమించిన తోపుడు బండ్లు, అక్రమ పార్కింగ్‌లు మరియు ఇతర అడ్డంకులను తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని



పోలీసులు విజ్ఞప్తి చేశారు.
రహదారులపై వాహనాలను అడ్డంగా నిలపవద్దని సూచించిన అధికారులు, నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## : ఎస్పీ విక్రాంత్ పాటిల్ -ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు స్వీకరణ

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)**
కర్నూలు జిల్లా పోలీసు అధికారి ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.
సోమవారం కర్నూలు కొత్తపేటలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.
ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 85 ఫిర్యాదులు వచ్చాయి.

### ప్రధాన ఫిర్యాదులు ఇవి:

**ఉద్యోగాల పేరుతో మోసాలు**
హైదరాబాద్‌లో టీమ్ లీజ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇస్తామని నకిలీ లెటర్ ఇచ్చి రూ. 4.80 లక్షలు తీసుకొని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలం ఫణి ఫిర్యాదు చేశారు.
బెంగళూరులో ఉద్యోగం ఇప్పిస్తామని రూ. 1.10 లక్షలు తీసుకొని మోసం చేసిన ఘటనపై పసుపుల గ్రామానికి



చెందిన సాయి ఫిర్యాదు చేశారు.

**నకిలీ ఉద్యోగాల మోసం**
సోలార్ కంపెనీ/ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇస్తామని ఐడీ కార్డులు ఇచ్చి మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని పందిపాడు గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు.

**బంగారం తాకట్టు వివాదం**
తాకట్టు పెట్టిన బంగారం తిరిగి ఇవ్వకుండా పరారైన వ్యక్తిపై ఎమ్మిగనూరు ప్రాంతానికి చెందిన బాధితులు ఫిర్యాదు చేశారు.

**కుటుంబ ఆస్తి వివాదం**
తన కుమారుడు ఆస్తి పంచకోరుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గుడూరు కు చెందిన జంగం మల్లయ్య ఫిర్యాదు చేశారు.



**పెట్టుబడుల మోసం:**
కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ధనలక్ష్మీ నగర్‌కు చెందిన బాధితులు ఫిర్యాదు చేశారు.

**డబుల్ రిజిస్ట్రేషన్ మోసం:**
సంతోష్ నగర్‌లో ప్లాట్‌ను డబుల్ రిజిస్టర్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముత్యాలమ్మ ఫిర్యాదు చేశారు.
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో వేగం పెంచండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, బ్యూరో మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల మెరుగుదల, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నందున, మున్సిపల్ కమిషనర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తిరుపతి, నాయుడుపేట ప్రాంతాల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణ, వాట్సాప్ సేవలు, కే పి ఐ డేటా ఎంట్రీలను మెరుగుపరచాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ప్రభుత్వ సేవలపై ప్రతికూల స్పందన వస్తోందని, దీనిని సరిచేసేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్లు, ఆర్.ఓ.ఆర్ సేవలు, రోడ్ల మరమ్మతులు,



రవాణా శాఖ సేవలు, గురుకుల పాఠశాలల పనితీరు మెరుగుపరచాలని ఆదేశించారు. వచ్చే గురువారం నాటికి 18 లక్షల డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జిల్లా అధికారులు సమానంగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి శాఖలో ప్రజా సంతృప్తి స్థాయి కనీసం 75 శాతం పైగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, గాలి వెలుతురు సమృద్ధిగా ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం చేపట్టి, ప్రతి కార్యాలయంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టరేట్‌కు తీసుకురాకుండా, ఆన్‌లైన్ లేదా 1100 నంబర్ ద్వారా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వడగాల్పుల నివారణ చర్యలు చేపట్టి, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద గ్రీన్ షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న అభ్యాసకుల ఫలితాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 3,000 ఖాతాల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను గుర్తించి అభివృద్ధి పనులకు వినియోగించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు కేవలం 79 ఖాతాల నుండి రూ.48.72 లక్షలు మాత్రమే జమ అయినందున, మిగిలిన ఖాతాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణాన్ని అభినందించిన కలెక్టర్, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. సరైన క్యూరింగ్ లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆధునిక సాంకేతికతల వినియోగంతో రోడ్ల జీవితకాలాన్ని పెంచాలని సూచించారు. జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# కర్నూలులో ఘనంగా ప్రపంచ జల దినోత్సవ వేడుకలు

## నీటి సంరక్షణపై అవగాహన విజేతలకు బహుమతులు ప్రదానం







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)**
ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు, లీగల్ సర్వీస్ యూనిట్ సభ్యుడు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బి. క్యాంపులోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఫర్ మెన్‌లో ఈ కార్యక్రమం జరిగింది.
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి 22న ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా నీటి ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నీటి సమస్యలను గుర్తించి, నీటి కొరత మరియు పారిశుద్ధ్య సమస్యలను వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనాలసిస్ట్ ఇమ్రాన్ మాట్లాడుతూ, నీటి నిర్వహణలో మహిళలు, బాలికల పాత్ర కీలకమని చెప్పారు. భూగర్భ జలాల పెంపు, నీటి కాలుష్య నియంత్రణ, వర్షపు నీటి నిల్వలు పెంపు వంటి అంశాలపై ప్రజలు దృష్టి పెట్టాలని సూచించారు.
ఈ సందర్భంగా “నీటి కాలుష్య నివారణలో యువత పాత్ర మరియు వినియోగదారుల హక్కులు” అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు త్రినాథ్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, షీల్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా ప్రశాంతి, వైస్ ప్రిన్సిపల్స్ హేమంత్, సత్యనారాయణ, బిపిఓ పవన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఫక్రున్నీసా బేగం, గవర్నమెంట్ వోకేషనల్ కాలేజీ ప్రిన్సిపల్ నాగ స్వామి నాయక్, కామర్స్ విభాగాధిపతి నాగన్న, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ నాగరత్నమ్మతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నతల్లిని కొట్టి చంపిన కొడుకు

## -మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదన్న ఆగ్రహంతో తల్లి తండ్రి పై దాడి -మూడు రోజుల నుంచి చికిత్స పొందుతూ తల్లి మృతి

**అవుకు మార్చి 23 రిపబ్లిక్ (న్యూస్)**
అవుకు పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఓ కుమారుడు తన తల్లిదండ్రులపై దాడి చేసి, తల్లి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చాడు.
స్థానికుల సమాచారం ప్రకారం, రామాంజనేయులు అనే వ్యక్తి కొంతకాలంగా మద్యం అలవాటుకు బానిసగా మారాడు. అతడు చేసిన అప్పులను తల్లిదండ్రులు ఇప్పటికే తీర్చినప్పటికీ, ఈనెల 19 ఉగాది పండుగ కావడంతో కొడుకు మద్యం తాగడం కోసం డబ్బులు ఇవ్వాలని కోరాడు. అయితే తల్లిదండ్రులు నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన కుమారుడు రామాంజనేయులు (25) తన తండ్రి పుసులూరు శేఖర్, తల్లి లక్ష్మీదేవిపై దాడి చేశాడు.
ఈ దాడిలో తండ్రికి స్వల్ప గాయాలు కాగా తల్లి లక్ష్మీదేవి తలకు తీవ్ర బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు వారిని కర్నూలు ప్రభుత్వ



ఆసుపత్రికి తరలించారు మూడు రోజుల నుంచి చికిత్స పొందుతూ వచ్చిన లక్ష్మీదేవి, మూడు రోజుల అనంతరం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అశోక్ వెల్లడించారు.
ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

**మృతి చెందిన లక్ష్మీదేవి ( ఫైల్)**

# ప్రజల దహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



**చిప్పగిరి, మార్చి, 23,( రిపబ్లిక్ న్యూస్)**
చిప్పగిరి నందు సోమవారం సర్పంచ్ దాసరి గోవిందరాజులు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు, సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



ఏర్పాటు చేశామని, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకే చిప్పగిరి లో ఎండాకాలం దృష్ట్యా స్కూలుకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు వృద్ధులు పొలానికి వెళ్లే రైతులు కూలీలు దృష్టిలో ఉంచుకొని చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అల్లా బకాస్, ఎమ్మార్వో ఇజాజ్ మహమ్మద్, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ పురుషోత్తం, పంచాయతీ సెక్రెటరీ సిసింద్రీ, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు బోగేస్ స్వామి, జనార్దన్ స్వామి, రామదుర్గం తిమ్మయ్య, మాధవులు, దుర్గయ్య, మోహన్, ఉమాపతి , వీరాంజి, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం

## ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)** అణగారిన వర్గాల అభ్యున్నతికి సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆయన జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి తన జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేశారని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పేదరికం, నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు విద్య ఒక్కటే మార్గమని నమ్మి, దానికోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు.
మయన్మార్‌లో వ్యాపారవేత్తగా ఎదిగిన ఆయన, తన సంపాదనను సమాజ సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగించిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. పేదల సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయడమే నిజమైన నివాళి అని జాయింట్ కలెక్టర్ అన్నారు.
ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, బిసి సంక్షేమ అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, ఐసిడిఎస్ పీడీ విజయ తదితరులు పాల్గొన్నారు

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

## : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





**గుత్తి మార్చి 23( రిపబ్లిక్ న్యూస్)**గుత్తి మండలం ఆబ్బెదొడ్డి గ్రామం సోమవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఆబ్బెదొడ్డి గ్రామం రైతులు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరాం గ్రామంలో ఇంటింటికి తిరిగి అన్నదాత సుఖీభవ.మూడో విడత నిధులు అందాయో లేదా అని రైతన్నలను అడిగి తెలుసుకుని. కరపత్రాలు పంపిణి చేశారు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రైతులకు సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యం, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది, రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు, ఏడాదికి రైతులకు కూటమి ప్రభుత్వం 20వేల సహాయం అందిస్తుందన్నారు, రైతులు ఆధునిక వ్యవసాయం వైపు నడవాలని ఎమ్మెల్యే తెలియజేశారు, ఈ కార్యక్రమంలో. తహసీల్దార్ పుణ్యవతి. ఎంపీడీవో ప్రభాకర్ నాయక్. ఏడిఏ వెంకటరాముడు, ఏవో మొహమ్మద్ ముస్తఫ్ ఖాన్. జిల్లా ఉపాధ్యక్షుడు బద్రి వలీ.వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్.పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి.మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య. చిన్న రెడ్డి.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ చికెన్ సీనా. టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు

# మాదిగల చైతన్య సదస్సు కరపత్రాలు విడుదల.



**గుత్తి మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్ )**గుత్తి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నందు సోమవారం ఈ నెల 30వ తేదీన అనంతపురం గిరిజన్ భవన్ లో ఏపీ ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో, జరుగు మాదిగల చైతన్య సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల న్యాయ విచారణ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఏర్పాటు చేయాలి ఎస్సీ ఎస్టీ పైన దాడులు అధికమైనవి వీటి పైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా రిమాండ్ కు పంపే విధంగా ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి రాందాసు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు రజాపురం రామాంజి, శివరామ్,అంజి, లాలు,కరీడికొండ శివ, ఓబులేసు,రమణ, బీఎస్పీ పార్టీ నాయకుడు ఎం రామాంజనేయులు, సలీం, సిపిఐ వెంకటరాముడు, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఎదురుపాడు గ్రామంలో అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు



**కొత్తపల్లి మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్)** శ్రీరామ నవమి పండుగ మరియు రథోత్సవం సంధర్భంగా నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం ఎదురుపాడు గ్రామంలో మార్చి 30 వ తేదీ సోమవారం అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు(4 పల్ల విభాగం) నిర్వహిస్తున్నట్లుగా గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు దాతల ద్వారా నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.40,000 లు, రెండవ బహుమతి రూ.30,000 లు, మూడవ బహుమతి రూ.20,000 లు, నాల్గవ బహుమతి రూ.15,000 లు, ఐదవ డు బహుమతి రూ.10,000లు, ఆరవ బహుమతి రూ.5000 దాతలచే బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే వారు మార్చి 30 వ తేదీ సోమవారం ఉదయం 6.30 గంటలలోపు ఎంట్రీఫీజు రూ.500లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని గ్రామ పెద్దలు,కమిటీ మెంబర్ లు తెలిపారు వివరాలకు సెల్ నెంబర్ 9885036724 9052059489 8142232830 సంప్రదించాలన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తాం.

**యువత ఆదర్శప్రాయుడు భగతసింగ్...**

**భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తాం - పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎం డి రఫీ**




**నంద్యాల మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్) :**స్థానిక నంద్యాల పట్టణం సాయిబాబా నగర్ సమీపంలో ఉన్న పి.డి.ఎస్.యు కార్యాలయంలో సోమవారం సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాపి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.యం.డి.రఫీ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన వ్యక్తి సర్దార్ భగత్ సింగ్ అని స్వాతంత్రం మా జన్మహక్కని బ్రిటిష్ పార్లమెంట్ మీద ఒక మందు గుండు బాంబును విసిరి తన నిరసన తెలిపిన వ్యక్తి భగత్ సింగ్ అని ఉద్ఘాటించారు,అత్యంత చిరుప్రాయంలో 22 ఏళ్ల వయసులో భారతదేశం కోసం తన ప్రాణాల సైతం లెక్కచేయకుండా ఉరి కంబాన్ని ముద్దాడిన విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, ఆశయాల కోసం పి.డి.ఎస్.యు నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బ్రిటిష్ సామ్రాజవాదుల నుండి మాతృభూమి విముక్తి కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని, వారిలో అగ్ర ఘన్యులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ లని, 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరితీసారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాడు ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతుందన్నారు. విద్య సామాజిక అవసరాలకు కాకుండా కార్పొరేట్ కాషాయ శక్తుల అవసరాలకు అనుకూలంగా నేడు విద్యారంగాన్ని కాషాయ పాలకుల మారుస్తున్నారుని కేంద్ర 20 శాతం రాష్ట్ర బడ్జెట్ 30 శాతం జీడిపిలో 6శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఆ నిధులను కేటాయించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ాణాఖ జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్, పట్టణ కార్యదర్శి లక్ష్మీకాంత్ ,నంద్యాల పట్టణ నాయకులు సుభాన్, హరి, నాయక్, కిరణ్, వినయ్, బాలాజీ, ధను, తదితరులు పోల్గొన్నారు .

## ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ఘన ఏర్పాట్లు డీఐజీకి ఆహ్వానం

**మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామనవమి ఉత్సవాలు - భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 23)**



వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్టలో జరగనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెల 27వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు హాజరుకావాలని కర్నూల్ రేంజ్ డీఐజీ డా. కోయ ప్రవీణ్ ఐపీఎస్ ని ఆలయ ప్రధాన అర్చకులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.సోమవారం కర్నూలులోని డీఐజీ క్యాంపు కార్యాలయంలో ఆలయ అర్చకులు, ఒంటిమిట్ట పోలీసు అధికారులు కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ నరసింహరాజు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్




**బండి ఆత్మకూరు, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):-** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. బండి ఆత్మకూరు మండలంలోనీ మూడు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి నంద్యాల జిల్లా ఇన్చార్జి డిప్యూటీ డిఇఓ శంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు. సోమవారం ఆయన బండి ఆత్మకూరులోని ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం, సంత జుటూరులోని పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట ఎంఈఓ యశోద,కానిస్టేబుల్ గంగా రామ్ ఉన్నారు. తర్వాత ఎస్సై జగన్మోహన్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ శివలింగం, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# తొలి పూజ అందుకున్న సంగమేశ్వరుడు

**సంగమేశ్వరుని దర్శనం... పులకించిన భక్తజనం - సప్త నదులు కలిసే ఏకైక ప్రదేశం**

**కొత్తపల్లి మార్చి 23 రిపబ్లిక్ న్యూస్:** సప్తనదుల్లో స్నానం ఆచరించి సంగమేశ్వరున్ని దర్శనం చేసుకుంటే పాపలనుంచి విముక్తి కలిగి మోక్షం లభించి నరకలోక ప్రవేశం తప్పుందని భక్తుల నమ్మకం. అందువల్లే ఈ ఆలయం ఏడాదిలో కొన్ని నెలలు మాత్రమే దర్శన భాగ్యం ఉండటంతో సందర్శన కోసం భక్తులు ఎదురు చూస్తుంటారు. గత ఏడాది ముందస్తు వర్షాలతో జూన్ చివరి వారంలో కృష్ణమ్మ పరువళ్లతో ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి చేరింది. శ్రీశైలం జలాశయనీటిమట్టం క్రమేపి తగ్గుతూ ఎనిమిది నెలల 20 రోజుల తర్వాత ఆలయం పూర్తిగా ఆదివారం బయటపడింది. ధర్మరాజు ప్రతిష్టింపబడిన వేపదారుని లింగం సగభాగం దర్శనమిచ్చింది. పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణంలో నిల్వఉన్నా నీరు, బుడదను శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టారు. ఉగాదికి బయటపడ్డా వినాయకుడు, పంచముఖ ఆంజనేయ స్వామి తదితర దేవతమూర్తులకు తొలిపూజ అందుకున్నారు. పూర్తి ఆలయంలో నీరు తగ్గడంతో పేరుకపోయి బురదను శుభ్రం చేయడంతో ఆదివారం వేపదారు శివలింగం దర్శనమిచ్చింది. సంగమేశ్వరం వేల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్న ఆధ్యాత్మిక ప్రాంతం. ఎందరో మునుల తపస్సుకు ఆశ్రయించిన స్థలం.

### ప్రపంచంలోనే ఏడు నదులు కలిసే ఏకైక ప్రదేశం

సంగమేశ్వరంలో తుంగ, భద్ర, క్రిష్ణ, వేణి, భీమ, మలాపహరిణి, భవనాసి అనే ఏడు నదులు కలిసే అద్భుతమైన ప్రదేశం. పురాణాల ప్రకారం ప్రజల పాప



ప్రక్షాళన చేస్తూ పాపులను పునీతులుగా మారుస్తున్న గాంగ నదికి కాకి రూపం వచ్చిందని ఆ రూపం పోగొట్టుకోవటానికి సమస్త తీర్థాలతో జలకమాడుతూ తిరుగుతూ సంగమంలో స్నానం చేసి హంస రూపం పొందిందని కథనం పాప నివృత్తి అయినందున ఈ ప్రదేశానికి నివృత్తి సంగమేశ్వరం అని పేరు.

### నాలుగు నెలలే పూజలు:

ఆలయ సముదాయం ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఆలయం క్రమంగా శిథిలమైపోయింది. ప్రస్తుతం కనిపిస్తున్న ఆలయం. సుమారు 200 సంవత్సరాల క్రితం స్థానిక ప్రజలు నిర్మించారు. సుమారు ఇరవై వేల చదరపుఅడుగుల విస్తీర్ణంలో ఆలయంతోపాటు, చుట్టూ ప్రకారం నిర్మించినట్లు శిథిలాలను చూస్తుంటే అర్ధమౌతుంది. ప్రస్తుతం కనిపించే ప్రధాన ఆలయం అత్యంత సాదాసీదాగా ఉంటుంది ముఖమండపం పూర్తిగా శిథిలమైపోగా అంతరాలయం, గర్భాలయాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. గర్భాలయంలో సంగమేశ్వరుడు పూజలందుకుంటున్నారు. శివుడు వెనుక వైపున ఎడమ భాగంలో శ్రీలలితాదేవి, కుడివైపున వినాయకుడు దర్శనమిస్తారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిలో ఈ ఆలయం మునిగి పోవటం వల్ల నిత్యపూజలు జరుగవు ఎడాదిలో నాలుగు నెలలు మాత్రమే పూజలు జరుగుతాయి.

### సంగమేశ్వరుని దర్శన భాగ్యం

ఎనిమిది నెలల నుంచి సంగమేశ్వరుని దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు దర్శన భాగ్యం లభించనుంది. ఆలయం నిల్వఉన్నా నీరు, బురద శుభ్రం చేశారు. ఆలయం వద్దకు వాహనాలు చేరుకుంటున్నాయి.
తొలి పూజ అందుకున్న సంగమేశ్వరుడు
సంగమేశ్వరం గర్భాలయం బయటపడడంతో సోమవారం సంగమేశ్వరుడు తొలి పూజ అందుకున్నారు. బయటపడిన వేప దారు శివలింగం పరిసరాలు ఆలయాన్ని శుభ్రం చేసి సోమవారం సాయంత్రం ఆలయ పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయపురహితులు చెప్పారు

# వలస కూలిని పొట్టన పెట్టుకున్న రోడ్డు ప్రమాదం

**తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళకు బండి ఆత్మకూరులో రోడ్డు ప్రమాదం**

**మోటార్ సైకిల్ పై కిందపడి మరో వ్యక్తి మృతి**

**వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం - ఒక మహిళతో పాటు మరో వ్యక్తి దుర్మరణం**



ప్రమాద స్థలంలో వలస కూలీ బాల కిట్టమ్మ, వాహనదారుడు మౌలాలి గాయపడిన దృశ్యం

**బండి ఆత్మకూరు, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):-**
వలస కూలీల బ్రతుకుల్లో రోడ్డు ప్రమాదాలు పెను విషాదాన్ని నింపుతున్నాయి. పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లాలో జరుగుతున్న 167కే రహదారి విస్తరణ పనుల కోసం వచ్చిన వలస కూలీనీ( ఒక మహిళ) మృత్యువు వెంటాడి రోడ్డు ప్రమాదం రూపంలో కబలించింది. ఆమె పని ప్రదేశంలో పని ముగించుకునేలోపు చీకటి పడుతుండటంతో వలస కూలీలు నివాసం ఉన్న ప్రదేశానికి త్వరగ చేరుకోవాలనే ఆత్రుతతో అదే దారిలో మోటార్ సైకిల్ పై వస్తున్న వ్యక్తిని ఆపి బండి ఆత్మకూరులో వదిలి పెట్టాలని కోరింది. అయితే అతను కూడా ఆమెను మోటార్ సైకిల్ పై ఎక్కించుకున్నాడు. కానీ ఆమోటార్ సైకిలే తనను వెంటాడుతున్న మృత్యువని ఆమె గ్రహించలేక పోయింది. చివరకు ఆమెను బైక్ పై ఎక్కించుకున్న వ్యక్తి అతివేగంగా వెళ్లి మోటార్ సైకిల్ కంట్రోల్ చేయలేక అదుపుతప్పి కింద పడేశాడు. దీంతో ఆమెకు తలకు బలమైన గాయం తగిలింది. హుటాహుటిన ఆమెను నంద్యాలకు తరలించి చికిత్స అందించారు. అప్పటికే ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించాల్సిందిగా అక్కడి వైద్యులు సూచించారు. ఆమె చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. ఎస్సై



కోలుకోలేక మృతి చెందిన ఈదన్న ఫైల్ ఫోటో

జగన్మోహన్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ జిల్లా, దేవరకద్ర మండలం, గోనపల్లె గ్రామానికి చెందిన బోయ బాల కిట్టమ్మ 43 అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి 167కే రహదారి విస్తరణ పనులకు బండి ఆత్మకూరు మండలానికి వచ్చింది. అయితే పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో అదే దారిలో మోటార్ సైకిల్ పై వస్తున్న పాములపాడు మండలం, కృష్ణరావుపేట గ్రామానికి చెందిన మౌలాలినీ బైకు ఆపి బండి ఆత్మకూరులో దించవలసిందిగా కోరిందన్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో వారాధి వంతెన వద్ద ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ అదుపుతప్పి వలస కూలి బాలకిట్టమ్మ, వాహనదారుడు మౌలాలి ఇద్దరు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో బాల కిట్టమ్మ తలకు బలమైన గాయం కావడంతో కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. ఈ ప్రమాదంలో వాహనదారుడు మౌలాలికి కూడా తీవ్ర గాయాల అయ్యాయి.మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.


### బైక్ పై నుంచి కిందపడి మరో వ్యక్తి మృతి

అలాగే మండల పరిధిలోని నాయిని చెరువు గూడేనికి చెందిన తోట ఈదన్న 25 అనే యువకుడు గత నాలుగు రోజుల క్రితం మోటార్ సైకిల్ పై ఈర్ణ పాడు వెళ్లి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు మోటార్ సైకిలు అదుపుతప్పి కింద పడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఈదన్నకు చాతిలో బలమైన గాయం కావడంతో కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య తోట నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.


## సీసీ కెమెరాల సహాయంతో గంటల వ్యవధిలో పోగొట్టుకున్న బ్యాగ్ స్వాధీనం

**బ్యాగును కనిపెట్టి బాధితులకు అందజేసిన వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి - వన్ టౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు**

**నంద్యాల క్రైం, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):** ఈనెల 22వ తేదీన సాయంత్రము షేక్ శాలినా, ఆమె భర్త పిల్లలు కలిసి బైక్ మీద చాబోలు నుండి నంద్యాల వన్ టౌన్ పరిధిలోని నడిగడ్డలోని ఆమె చెల్లెలు ఇంటికి బట్టలు, 12 తులాల బంగారాన్ని బ్యాగ్లో పెట్టుకుని వస్తుండగా వన్ టౌన్ పరిధిలోకి వచ్చేసరికి బంగారు ఉన్న బ్యాగ్ పడిపోయింది. సదరు విషయాన్ని గమనించిన ఫిర్యాదిదారులు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగింది. సదరు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసిన అనంతరం ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తన సిబ్బంది సహాయంతో నంద్యాల టౌన్ పరిధిలో బాధితులు వెళ్లిన ప్రదేశంలోని



వివిధ సీసీ కెమెరాలను, పట్టణ కేంద్రంలో ఉన్న కమాండ్ కంట్రోల్ లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి సదరు బాగ్ నడిగడ్డకి చెందిన ఆటో డ్రైవర్ అయిన నూరుల్లా భాషాకి దొరికిన సమాచారము తెలుసుకుని అతన్ని పిలిపించి విచారించగా పోయిన బ్యాగ్ ని తీసుకుని ఇవ్వడం జరిగింది. సదరు బ్యాగ్ ని ఫిర్యాదు సమక్షములో పరిశీలించగా అందులో బంగారు నగలు అన్నీ ఉన్నాయని గుర్తించారు. సోమవారం తరువాత 12 తులాల



నగలను బట్టలను ఫిర్యాదుదారులుకు అప్పగించడమయినది. కేవలం గంటల వ్యవధిలో ఇన్స్పెక్టర్ తన సిబ్బందిని అప్రమత్తం చేసి పోగొట్టుకున్న బ్యాగును కనిపెట్టి బాధితులకు ఇవ్వడంతో వారు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డికి వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 91 ఫిర్యాదులు

**నంద్యాల క్రైం, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఫిర్యాదుదారుల నుండి 91 ఫిర్యాదులు స్వీకరించి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజా రిపబ్లిక్



## ప్రభుత్వ వసతి గృహాన్ని తనిఖీ చేసిన అధికారులు.



**ఓబులవారిపల్లి మార్చి 23 రిపబ్లిక్ న్యూస్.**
మండల కేంద్రం ఓబులవారిపల్లి లోని ప్రభుత్వ బాలుర సంక్షేమ శాఖ వసతి గృహాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారులు డి ఈ రామ్మోహన్ రెడ్డి, రవి శంకర్ ఇద్దరు ప్రభుత్వ ఇంజనీర్లు సోమవారం పరిశీలించారు, వసతి గృహంలోని బిల్డింగ్ అణువణువు పరిశీలించారు,వంటగది డైనింగ్ హాల్ ప్రహరీ ఆఫీసు రూమ్ విద్యార్థులు బసచేసే గదులతోపాటు టాయిలెట్స్ అన్ని తనిఖీ చేసి నివేదికను తయారుచేసి పై అధికారులకు పంపనున్నట్లు వారు చెప్పారు, వసతి గృహంలో విద్యార్థుల బసచేసే గదులలో ఫ్యాన్లు విండోలు బిల్డింగ్ రూఫ్ అన్ని పరిశీలించి బిల్డింగ్ మరమ్మతులు చేయనున్నట్లు వారు తెలిపారు ఇందుకు గాను సుమారు 13 లక్షల రూపాయల మంజూరు చేసినట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈ ఆంజనేయ రెడ్డి వసతి గృహ అధికారి విజయ్ కుమార్, వంట మనిషి వెంకటరమణ వాచ్మెన్ ఎం రమణయ్య విద్యార్థులు పాల్గొన్నారు

## సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు చేసిన సర్పంచ్, జరుగు నారాయణరెడ్డి.



**ఓబులవారిపల్లి మార్చి 23 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలం ఎల్లాయపల్లి పంచాయతీ ముక్కవారి పల్లి నుండి పెద్దఓరం పాడు వెళ్లే ఎల్లాయపల్లె సమీపాన మలుపు తిరిగే చోట రోడ్డు కంపచెట్లు పెరిగిపోవడం రోడ్డు గుంతలమయం కావడం వలన తరచూ అక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించి స్థానిక సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి తన సొంత నిధులతో జెసిపి యంత్రసహాయంతో ట్రాక్టర్లు ద్వారా మట్టిని తరలించి గుంతలో పూడ్చడం జరిగినది రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచర్లను తొలగించడం వలన రోడ్డు విశాలంగా ప్రజలకు రవాణాకు పాదాచారులకు గ్రామస్తులకు అనువుగా తయారైనదని నారాయణరెడ్డి అన్నారు, నా ప్రాంత ప్రజల కోసం సొంత నిధులను హెచ్చించి ఈ మరమ్మతులు చేయించానని సోమవారం ఆయన విలేకరులకు తెలియజేశారు, రోడ్డు మరమ్మతులు చేయించడం వలన స్థానిక ప్రజలు వాహనదారులు పాదాచార్యులు స్థానిక సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి స్థానిక నాయకులు మూరి వెంకటరెడ్డి సుబ్బరాయుడు శ్రీను పలువురు వైసిపి నాయకులు పాల్గొనడం జరిగినది.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో జాతీయ ఆర్థిక అక్షరాస్యత సదస్సు.



**ఓబులవారిపల్లి మార్చి 23 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లి మండలం సంజీవపురం కడప చెన్నై జాతీయ రహదారి అనుకొని ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో సోమవారం జాతీయ ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించడం జరిగినది, ఈ సదస్సులోవిద్యార్థి దశ నుండి ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని ప్రిన్సిపల్ డాక్టర్ మన్సుర్ అలీ సదస్సులో విద్యార్థులకు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూర్ అలీ పాల్గొన్నారు,నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్, సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ సంస్థల ఆధ్వర్యంలో 10 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల లోపు విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు . ఈ కార్యక్రమాలలో భాగంగా ఆర్థికంగా అవగాహన ఉన్న భారతదేశం అనే లక్ష్యంతో ఎన్సీఈఎఫ్, సి ఎఫ్ ఎల్ సంస్థలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డబ్బు సంపాదన, పొదుపు, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకోవడం, బ్యాంక్ ఖాతా తెరవడంతో పాటు ఇతర పథకాలు, సుకన్య సమృద్ధి యోజన, ఎన్పీఎస్ వాత్సల్య , ఇన్సూరెన్స్, సైబర్ నేరాలు, బ్యాంక్ అంబుడ్స్మన్, అన్క్లైమ్డ్ డిపాజిట్, డిజిటల్ లావాదేవీలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లు ప్రతాప్, శ్రీహరి, రామ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రగిరి నియోజకవర్గంలో అట్టహాసంగా
# సర్పంచ్ లకు ఆత్మీయ అభినందన సభ..

### - రెండేళ్లు సరిపడేంతలా అభివృద్ధి..- ఇది ఒక చరిత్రగా మిగిలిపోతుందని వ్యాఖ్యలు..







**ఏపీ బ్యూరో, మార్చి 23 - (రిపబ్లిక్ న్యూస్) -**
చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన సర్పంచులకు చెవిరెడ్డి కుటుంబ సభ్యులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 2వ తారీకున సర్పంచులకు ఐదేళ్ల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా చెవిరెడ్డి కుటుంబం వారిని ఘనంగా సత్కరించే ఏర్పాట్లు చేశారు. వేదిక సభ ఏర్పాటు చేసి గ్రామాలకు ఐదేళ్లుగా సేవలు అందించిన సర్పంచులకు ఘనంగా సత్కరించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ ఈ కార్యక్రమం జరిగింది. ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో సర్పంచ్‌ల హాజరు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నేతలకు సన్మాన కార్యక్రమం పదవీకాలం ముగిసిన సందర్భంగా వారు చేసిన సేవలకు గుర్తింపుగా కార్యక్రమం నిర్వహించామని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా యువ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో సర్పంచులు అధికారానికి కాదు. అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని గ్రామాల్లో చేసిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచిపోతుందని తమ గ్రామాలను ఎంతో గొప్పగా ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఎంత గొప్పగా అభివృద్ధి సాధించిందంటే మన తరువాత అధికారంలోకి వచ్చిన వారు ప్రారంభోత్సవాలు చేసుకునేందుకు రెండేళ్లు సరిపడేంతలా అభివృద్ధి చేశామని ఇది ఒక చరిత్రగా మిగిలిపోతుందన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచులు వేరు కాదు. మా కుటుంబం వేరు కాదు. అందరూ ఒకే కుటుంబంలా బ్రతికాము. రాజకీయంగానే కాకుండా కష్టమొచ్చినా, ఆపదొచ్చిన, పండుగొచ్చిన, విపత్తు వచ్చినా అందరూ ఒకటిగానే నిలబడ్డామన్నారు. ఎప్పుడు ఏ అవసరమొచ్చినా సొంత మనిషిలా మీకు సాయం చేశాను. మీరు కూడా నన్ను ఒక నాయకుడిగా కంటే ఒక కుటుంబ పెద్దగా భావించి ఆదరించారు. పాతికేళ్లకు పైగా మన బంధం ఒక కుటుంబంగానే కొనసాగింది. ఇప్పుడు కూడా నాపై కూటమి ప్రభుత్వ కుట్రలను ఎదర్కొవడానికి ఒక కుటుంబంగానే పోరాడుతున్నాము. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులతో గ్రామ సర్పంచ్ పేరును భవిష్యత్తు తరాలు చెప్పుకుంటాయి. ఒక పంచాయతీని రూ.5 నుంచి రూ.10కోట్లతో అభివృద్ధి చేసి చూపించామని సర్పంచ్ లు తలెత్తుకునేలా చేశామని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేశామని రచ్చబండలు కట్టించామని గ్రామ సచివాలయాలు కట్టించామని రైతు భరోసా కేంద్రాలు కట్టించామని కల్యాణ వేదికలు నిర్మించామని కర్మ క్రియల భవనాలు కట్టించామని యోగ, ధ్యాన మందిరాలు కట్టించామని మహిళా భవనాలు నిర్మించామని సిమెంటు బల్లలు వేయించామని పచ్చని చెట్లు నాటించామని ఇలా చెప్పలేనంతగా అభివృద్ధిని పరుగులు తీయించామని చంద్రగిరిలో జరిగిన అభివృద్ధి మరెక్కడా జరగలేదని నభూతో నభవిష్యత్తన్న విధంగా గ్రామాలను తీర్చిదిద్దామని అదంతా సర్పంచులుగా ఉన్న మీ అందరి సహకారంతోనే సాధ్యమైందన్నారు. గ్రామ పంచాయతీ పటంలో మీ పేరు చిరస్థాయిగా నిలిచిపోవడమే కాకుండా ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి తరతరాలు చెప్పుకుంటాయని జగనన్న ప్రభుత్వంలో మూడేళ్లుగా పరిపాలన చేసిన సర్పంచ్ లు రెండేళ్ల పాటు కూటమి ప్రభుత్వంలో కూడా పనిచేశారని గ్రామాల్లో అప్పుడు జరిగిన అభివృద్ధి తప్ప ఈ రెండేళ్లలో ఏమీ జరగలేదనేది మీ అందరికీ కూడా తెలుసన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు నేటికీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నారంటే ఏ స్థాయిలో మనం అభివృద్ధి చేశామో గుర్తుంచుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించామని ప్రభుత్వం మారినా మీ పోరాట పటిమ మాత్రం మారలేదని జగనన్న ఇచ్చిన అవకాశం, జగనన్న అందించిన సహకారం, జగనన్న చూపించిన ఆదరణతోనే చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పది కోట్లకు తక్కువ లేకుండా అభివృద్ధి పనులు చేయగలిగామన్నారు. సర్పంచులుగా మీ పదవీ కాలం ముగియగానే వెనక్కు తిరిగి చూసుకుంటే ఏమీ లేదన్న బాధ మీకు అవసరం లేదని కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి మీ వెంట నిలిచిందని ఎవరొచ్చి అడిగినా సర్పంచ్ గా మీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూపించవచ్చన్నారు. పదవిలో ఉన్నప్పుడు పంచాయతీ అభివృద్ధికి పనిచేశారు. పదవి పూర్తయిన తరువాత పార్టీకి పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. పంచాయతీల్లో సర్పంచు లుగా ఉన్నంత కాలం మీరు రాజకీయాలు చేయలేదు కానీ ఏప్రిల్ 2వ తేదీ తరువాత మీ పదవులు ముగియగానే జగనన్న సైనికులుగా మారి పార్టీ పటిష్టతకు గ్రామ స్థాయిలో పనిచేయాలని కోరుతున్నానని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

### ఎన్నికల్లో ఏదో జరిగింది..

ఒక మనిషి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఓటు వేసి బయటకు రావాలంటే 6 నుంచి 7 నిమిషాల సమయం పడుతుందని సీనియర్ జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులు టీవీల డిబేట్లలో చెబుతున్నారు. పోలింగ్ జరిగిన రోజు ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు జరిగిన ప్రక్రియ. అదే రాత్రి 11గంటల నుంచి తెల్లవారు జామున 2గంటల లోపు ఒక నిమిషానికి మూడు ఓట్లు పోల్ చేయగా అవన్నీ కూడా లెక్కించారని చెబుతున్నారు. అలా ఎలా జరుగుతుందని అందరూ ఒక్క సారి ఆలోచించాలి. ఆ ప్రకారం చూస్తే జనం మనల్ని ఓడించలేదు. సరే దేన్నయినా స్వీకరించగల దమ్ము వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉంది. అదే జగనన్న సైనికుల ధైర్యం. కుట్రలు, కుతంత్రాలు, మాయాజాలంతో ఓడిపోయినా సరే మరలా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పట్ల పోరాటం చేయగల శక్తి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉంది కనుక యుద్ధానికి సిద్ధమయ్యాం. పోరాడే వారిని, ప్రశ్నించే వారిని జైళ్లలో పెట్టినంత మాత్రాన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు భయపడరు. ఆ నైజం పార్టీ కార్యకర్తలకు రాకూడదని హెచ్చరిస్తున్నా. చంద్రగిరిలో ఓటమితో ప్రారంభమైన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రాజకీయ జీవితం భవిష్యత్తులో అపార విజయాలను సొంతం చేస్తుంది. అతని రాజకీయ జీవితం మరింత పటిష్టంగా తయారవుతుందని సూచిస్తున్నా. చంద్రగిరిలో వున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మోహిత్ రెడ్డి వేరు కాదు. మేము వేరు కాదన్న భావనతో అక్కున చేర్చుకున్నారు. అతని పట్ల కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అండగా నిలబడ్డారు. మీరు మా కుటుంబం పట్ల చూపించే ఆదరణ వెలకట్టలేనిది. మీకు ఏ కష్టం వచ్చినా నేను నా కుటుంబం అండగా నిలుస్తుందని మాట ఇస్తున్నా. పంచాయతీలో సర్పంచ్ గా మీరు దిగిన మరుసటి రోజు నుంచే పార్టీ జెండా పట్టుకుని ప్రజల పక్షాన ప్రభుత్వ తప్పిదాలను ఎండగడుతూ జగనన్న సైనికులుగా మారాలని కోరుకుంటున్నానని



పేర్కొన్నారు.

### హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ..

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ల స్థానం చాలా గొప్పది. గ్రామ పంచాయతీకి ప్రథమ పౌరుడు హక్కు సర్పంచు కుంటుంది. గ్రామ పంచాయతీల్లో ఎక్కడికెళ్లిన మనం చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనబడుతోంది. చేసిన అభివృద్ధిని మనం చెప్పుకోలేక పోయిండొచ్చు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సర్పంచులు చేసిన అభివృద్ధి చూసి వాళ్లను మళ్లీ సర్పంచులుగా గెలిపిస్తారన్న ధీమా ఉందన్నారు. సర్పంచులుగా పదవీ కాలం ముగిసిన తరువాత పార్టీకీ సేవలందించడానికి అందరూ సమాయత్తం కావాలని అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో ఓటర్ల నమోదు, తొలగింపు, బదిలీల ప్రక్రియ గుట్టుగా సాగిస్తున్నారు. దానిని మనం జాగ్రత్తగా గమనించకుంటే భవిష్యత్తులో మన ఓట్లు కనబడకుండా పోయే ప్రమాదం ఉందన్నారు..







# వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం





**మల్లాపూర్ మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండలం వి.వి. రావుపేటలో మల్లాపూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో (మల్లాపూర్ & రాయికల్) రెండు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను నర్సింగం సార్ స్పోర్ట్స్ క్లబ్ సహకారంతో వేంపల్లి ఉప సర్పంచ్ రొద్ద రాజు, హారిక నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 20 టీంలు పాల్గొనగా,తాట్లవాయి అల్య నాయక్ తండా టీం విన్నర్ గా, వి. వి రావ్ పెట్ టీం రన్నర్ గా గెలుపొందాయి. విజేతలకు ఉప సర్పంచ్ రొద్ద రాజు హారిక షిల్డ్ లతో పాటు, 3000 మరియు 2000 చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మల్లాపూర్ ఎస్సై అనిల్ కు సన్మానం చేసారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రొద్ద రాజు హారిక మాట్లాడుతూ క్రీడలు యువతకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలని కోరారు . ఈ సందర్భంగా టోర్నమెంట్ ఏర్పాటు చేసిన రొద్ద రాజును యువకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు నరసింగం సార్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం





**మల్లాపూర్ మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్)**
లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో మార్చి 23 న ఉచిత నేత్ర వైద్య శిబిరం గ్రామ పంచాయతీ కార్యాలయం సాతారం గ్రామంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో మొత్తం 125 మంది వ్యక్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 27 మంది మోతె బిందు సమస్యతో బాధపడుతున్నవారిగా గుర్తించబడి, ఉచిత శస్త్ర చికిత్స కోసం రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచితంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్ ద్వారా తరలించబడ్డారు.ప్రతి ఒక్కరికి సుమారు 20,000 విలువ చేసే IOL సర్జరీలు లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల తరఫున పూర్తిగా ఉచితంగా చేయించబడతాయి. శస్త్ర చికిత్స అనంతరం వీరిని మార్చి 25 ఉదయం తిరిగి చిన్నమెట్‌పల్లి గ్రామానికి భద్రంగా తీసుకురానున్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి, కార్యదర్శి ఏలేటి లక్ష్మారెడ్డి, కోశాధికారి నల్ల గంగాధర్, కల్లెం గంగారెడ్డి, సర్పంచ్ నారాయణ గౌడ్, గ్రామ పెద్దలు పాల్గొని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్య చైతన్యం పెంపొందించడం మరియు అవసరమైన వైద్య సేవలను చేరవెయ్యడం లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల నిరంతరంగా కృషి చేస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి తెలిపారు.

## ఎంపీ మెదక్ రఘునందన్ రావు జన్మదిన వేడుకలు



**హత్నూర:23 మార్చ్ 26( రిపబ్లిక్ న్యూస్)** బిజెపి ఫైర్ బ్రాండ్ మెదక్ ఎంపీ మాధవ నేని రఘునందన్ రావు జన్మదిన వేడుకలు కొన్యాల గ్రామంలో ఘనంగా జరిపారు ఈ కార్యక్రమంలో కొన్యాల కురుమ సంఘం అధ్యక్షులు జగ్గంపేట పోచయ్య మాట్లాడుతూ మన ఎంపీ రఘునందన్ రావు ఓడిన గెలిచిన ప్రజలలో ఉంటూ ప్రజాసేవకే నా జీవితం అంకితం అంటూ తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకుంటూ ముందుకు వెళుతున్న మెదక్ పార్లమెంట్ నే గడగడలాడించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి మనసు దోచుకున్న రఘునందన్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పత్తి ఎల్లెందర్, పత్తి మాణిక్యం, గొల్ల బీరప్ప, చాకలి లక్ష్మణ్, మరియు తదితరులు పాల్గొన్నారు

## పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 23 రిపబ్లిక్ న్యూస్**



పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ అన్నారు. మండల కేంద్రమైన చౌడేపల్లి లో ఇల్లు నీటి పన్నులను వసూలు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు బకాయిలు ఉన్నవారు. ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు పిడిఓలు పంచాయతీ సిబ్బంది గ్రూపులుగా ఏర్పడి ఇంటి పన్నులు వసూలు చేయాలని అన్నారు అనంతరం ఇంటింటికి వెళ్లి వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఓ మహేష్ ,పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## భారతదేశ ప్రజానీకానికి చిరస్మరణీయ,మరచిపోలేని రోజు!

బుగ్గన మధుసూదనరెడ్డి,సామాజిక విశ్లేషకుడు, బేతంచెర్ల

**బేతంచర్ల ప్రతినిధి, మార్చి 23,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



ఈనెల 23వ తేదీ సోమవారం మర్చిపోలేని రోజు ఎందుకంటే భారతదేశ ప్రజానీకానికి బ్రిటిష్ వారి ద్రాస్య శృంఖలాల నుంచి బంధ విముక్తులు గావించేందుకు,స్వేచ్ఛ వాయువులు ప్రసాదించేందుకు ఒకప్పటి మేటి స్వాతంత్ర్య సమరయోధులు,అణువణువూనా,నర నరాల్లో దేశభక్తి మూర్తిభవించిన అపారదేశభక్తులు అయిన భగత్ సింగ్,సుఖ్ దేవ్,రాజ్ గురు వీరంతా ఒక విప్లవాత్మక పంథాలో ముందుకు వెళ్లి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాద శక్తులతో ఎదురొడ్డి నిలిచి వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి,అతి చిన్న వయసులోనే అలుపెరుగని పోరు సల్పి మరీ వారిపై తిరుగుబాటు బావుట ఎగురవేసి,చివరకు బ్రిటిష్ వారి ఉరి కంబానికి బలి అయ్యి,మరెందరికో,అశేష కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తి ప్రధాతగా నిలిచిన త్యాగమూర్తులు,అపార దేశభక్తులు ఈ త్రిమూర్తులు. ఆ ముగ్గురు గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్ వారి కర్కశత్వానికి,దుర్మార్గానికి,అత్యంత కిరాతక చర్యకు బలై నేటికి 95 సంవత్సరాలు పూర్తి అయిన ఈ ప్రత్యేక సందర్భాన మన భారతదేశ ప్రజలకు బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి విముక్తి గావించేందుకు ప్రాణత్యాగాలకు సైతం వెనుకంజ వేయని దీరోదత్తులు,ధైర్య సాహసాలకు మారుపేరైనా ఈ త్రిమూర్తులు మన భరతమాత శ్రేయస్సు,సుఖ సంతోషాల కోసం,మన మాతృభూమి రక్షణ కోసం వారు చేసిన వెలకట్టలేని,మహోన్నత సేవలను ఒక్కసారి ఈ ప్రత్యేక సమయాన స్మరించుకుంటూ వారికి చాలా ఘనమైన గొప్ప రీతిలో నివాళులు అర్పించాల్సిన గురుతర బాధ్యత ప్రతి యొక్క భారతీయుని భుజస్కంధాలపై ఎంతైనా వుంది.

# ఇక్కడ ఆ పార్టీకి ఆది నుంచి సవాలే..!

**- తంబళ్లపల్లి టీడీపీ లో తెలుగు తమ్ముళ్ల అయోమయం..**

**- ఓటమి నుండి ఖాళీగా ఉన్న నియోజకవర్గ ఇంచార్జ్ ను త్వరగా భర్తీ చేయాలని అధిష్టాన పెద్దలకు వేడుకోలు..**







**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 23 - (రిపబ్లిక్ న్యూస్) -**
తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ లో అనిశ్చితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇక్కడ మాత్రం తెలుగు తమ్ముళ్లు నిరాశకు లోనవుతూనే ఉన్నారు. మొదటి నుంచి ఇక్కడ తెలుగు తమ్ముళ్లు అయోమయానికి గురయ్యారు. చివరి దశలో తంబళ్లపల్లి నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ దక్కించుకున్న మొరుసుకాపు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన దాసరపల్లి జయచంద్రారెడ్డి మొరుసుకాపు సెంటిమెంట్ తో తెలుగుదేశం పార్టీ అధిష్టాన పెద్దల మదిలో పడి టికెట్ దక్కించుకున్నారు. అంతకు ముందు సుమారు పది సంవత్సరాలు నియోజకవర్గంలో టీడీపీకి పెద్ద దిక్కుగా ఉంటూ సేవలందించిన జి. శంకర్ యాదవ్ ను కాదని తెలుగుదేశం పార్టీ అధిష్టానం దాసరపల్లి జయచంద్రారెడ్డి వైపే మొగ్గు చూపింది. ఎట్టకేలకు ఆయనకే తంబళ్లపల్లి అసెంబ్లీ టికెట్ ఖరారు చేయడంతో జి. శంకర్ యాదవ్ మరియు ఆయన వర్గీయులకు మింగుడు పడలేదు. తనను కాదని పార్టీలో కొత్తగా చేరిన వారికి అసెంబ్లీ టికెట్ ఇవ్వడమేంటని నిరసిస్తూ ఆయన వర్గీయులు ఎన్నికలకు ముందు ఎన్నో మార్లు అమరావతి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఒకానొక దశలో సీఎం చంద్రబాబు ఇంటి ముందు పెట్రోల్ క్యాన్లతో నిరసన చేపట్టారు. అయినా కూడా ఎవరెన్ని చేసినా టీడీపీ అధిష్టాన పెద్దలు ఒకటే నిర్ణయమంటూ దాసరపల్లి జయచంద్రారెడ్డి కే మద్దతు ఇవ్వాలని జి. శంకర్ యాదవ్ వర్గీయులకు అల్టిమేట్టం జారీ చేశారు. అధిష్టాన పెద్దలు కోరడంతో చేసేదేమీ లేక కొందరు పాత క్యాడర్ దాసరపల్లి జయ చంద్రారెడ్డికి మద్దతు ప్రకటించారు. ఆయన పాత క్యాడర్ ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన వెంట వచ్చిన వారికి ప్రాధాన్యత నివ్వడంతో కొందరు పార్టీ సీనియర్ నాయకులు కాముగా అయిపోయారు. మరి కొంత మంది అంటి ముట్టునట్టుగా కొనసాగారు. ఎన్నికలు రానే వచ్చాయి. ఇక్కడ వైసీపీ తరపున పోటీ చేసి అంతకు ముందు శాసనసభ్యులుగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డితో దాసరపల్లి జయ చంద్రారెడ్డి ఢీకొట్టేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి హావ నడిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెండు ప్రాంతాల్లో పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడించలేక పోయాయి. పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి హావా నడిచిన ఇక్కడ ఓటమిని అంగీకరించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి మరో మారు తంబళ్లపల్లి నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేశారు. ఓటమి తర్వాత టీడీపీ ఇంచార్జ్ గా కొనసాగిన ఓటమి నేత దాసరపల్లి జయ చంద్రారెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గం లో ఇండస్ట్రియల్ కారిడార్ తెస్తానని తబల్లపల్లి ప్రజలకు చెప్పిన మాటకు అనుగుణంగానే రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ ప్లాంటును నెలకొల్పాడు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఆ వ్యవహారంలో సూత్ర, పాత్ర ధారుడిగా ఉన్న ఇంచార్జ్ నేత దాసరపల్లి జయ చంద్రారెడ్డి ఆయన బామ్మర్ది మంత్రి గిరిధర్ రెడ్డిలు దేశం విడిచి పారిపోయారు. తదనంతరం నాటకీయ పరిణామాల మధ్య తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి తంబళ్లపల్లి నియోజకవర్గానికి ఇంచార్జ్ కరువయ్యారు. ఇక్కడ జరిగిన పరిణామాలకు తెలుగు తమ్ముళ్ల నిరాశకు లోనయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా హావ కొనసాగుతున్న ఇక్కడ మాత్రం హావ కొనసాగలేదు. ఇక్కడ ఉన్న తెలుగు తమ్ముళ్ల ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు సాగుతున్నారు. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలు రాబోతున్నాయి. ఆ లోపు ఇంచార్జ్ ను ప్రకటించకపోతే ఇక్కడ ఇబ్బందేనని తెలుగు తమ్ముళ్ల చర్చించుకుంటున్నారు. నెలకు ముందు జి. శంకర్ యాదవ్ ను మళ్లీ ఇంచార్జ్ గా ప్రకటిస్తారని ఊహాగానాలు వెల్లువెత్తాయి. ఇక తమదేనంటూ జి. శంకర్ యాదవ్ వర్గీయులు పెద్ద ఎత్తున సంబరాలకు దిగుతున్న వేళ రెండు కుంపట్లు గా ఉన్న వర్గాలు జి. శంకర్ యాదవ్ పై తెలుగుదేశం పార్టీ అధిష్టానం వద్ద మొరపెట్టుకోవడంతో మళ్ళీ యధాస్థితి తదాస్థితి అన్న రీతిలో పెండింగ్ లో పడింది. ఒక తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుడు మీడియా ద్వారా విన్నవిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లకు తంబళ్లపల్లి నియోజకవర్గ స్థితిగతులపై మీ దృష్టికి తీసుకొస్తున్నామని తంబళ్లపల్లి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గా కొనసాగిన దాసరపల్లి జయ చంద్రారెడ్డిని మద్యం కేసులో నిందితుడిగా ఉన్నందున పార్టీ నుండి సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేసి ఇప్పటికి ఆరు నెలలైంది. ఇప్పటి వరకు ఎవరిని ఇంచార్జ్ గా ప్రకటించలేదు. తెలుగుదేశం కార్యకర్తలు తంబళ్లపల్లి నియోజకవర్గం లో చాలా నిరుత్సాహంగా ఉన్నారు. ఎవరికి ఏం పనులు జరగటం లేదు. దయ వుంచి కార్యకర్తలు మనోవేదనను, ప్రజలు కష్టాలను గట్టెక్కించేందుకు తంబళ్లపల్లి నియోజకవర్గంలో పార్టీ భవిష్యత్తును మళ్లీ పునర్ వైభవం తెచ్చేందుకు ఇక్కడ ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డిని ఢీకొట్టే ఘనమైన నాయకుడిని మంచి వ్యక్తి ప్రజాసేవకుడిని ప్రజల కష్టాలను తీర్చే సిసలైన నాయకుడిని నిలబెట్టాలని మీడియా ద్వారా టీడీపీ అధిష్టాన పెద్దలకు విన్నవించారు..

# భూ సర్వే కు రెవెన్యూ అధికారులే సమస్య

**చేతులెత్తేసిన రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ -ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు**

**కాసులకు కక్కుర్తిపడిన రెవిన్యూ అధికారులు -ఓ బాధిత రైతుకు జిల్లా కలెక్టర్ న్యాయం చేసేనా**




**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 23, అనంతపురం**
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలు ప్రతి మండల పరిధిలో తిష్ట వేశాయి. సమస్యలపై స్పందించాల్సిన అధికారులు కాసుల మూటలు వెనకేసుకునేందుకు ముగ్గు చూపుతున్నారు. దీంతో అడ్డదారిలో అధికంగా సంపాదిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. తహసిల్దార్ కార్యాలయాల్లో ఏ రైతుకైనా భూ సమస్య వస్తే కిందిస్థాయి సిబ్బంది నుంచి మండల తహసిల్దార్ వరకు ముడుపులు అందజేస్తేనే ఆధారాబాదరగాఆ పనులవుతాయనేది జగమెరిగిన సత్యం. కొందరు రైతులు వారి అడిగినంత ఇచ్చుకోక, ఆర్థిక స్తోమత లేక ఇవ్వలేక శతమవుతమవుతున్న వారెందరో ఉన్నారు. ఇవ్వలేని రైతులను ఆసరా చేసుకుని వారికి అనేక ఇబ్బందులకు గురి చేస్తూ కాలయాపనతో గడిపేస్తున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ కూడా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. బాధిత రైతులు కార్యాలయాలలోకి వెళ్లేటప్పుడు కార్యాలయం గుమ్మం ముందే ఎవరు నువ్వు ఎందుకు వచ్చావు అని ఆరా తీస్తూ వచ్చిన వారి విషయాలను తెలుసుకొని సంబంధిత అధికారులకు చేరవేస్తున్నారు. కార్యాలయం గుమ్మం ముందే బాధితులను ఆపి తిరిగి వెనక్కి పంపేస్తున్నారు. ఇలా తిరిగి వెళ్లిపోయిన బాధితులు ఎందరో...

### ఏదో ఒక సాకు చెప్పి తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు

సంబంధిత కార్యాలయాలలో బాధితులు పక్షాన మాట్లాడినాతుడే కరువయ్యారు. ఎందుకొచ్చారని సమస్య ఏమైనా ఉందా అని ఆరా తీయకుండానే... వచ్చిన ప్రతి బాధితులను కూడా గుచ్చి గుచ్చి అడిగి మరీ వెనక్కి పంపే సంస్కృతి ప్రతి మండల రెవెన్యూ తాసిల్దార్ కార్యాలయాలలో సాంప్రదాయంగా కొనసాగుతోంది. వీటిని అడ్డుకట్ట వేసే నాధుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క అధికారి కూడా లేరనే చెప్పవచ్చు. అందులో భాగంగా మండల తహసిల్దార్ పరిధిలో ఆయా గ్రామాలలోని రైతుల భూ రికార్డులను ఏ అధికారి తారుమారు చేశారో... ఆ అధికారి పక్షాన ఆ మండల తహసీల్దార్ కార్యాలయాలలో కొందరు ప్రత్యేకించి బాధితులను కనుగొనేందుకు తనకు అనుకూలమైన వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కార్యాలయాలకు వచ్చిన బాధిత రైతులను ఏదో ఒక సాకు చెప్పి తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు. లేదా అధికారులు వచ్చి మీ సమస్యను పరిష్కరిస్తాం అంటున్నారు ఎవరి మాటలు విన్నొద్దండి... వచ్చిన దారిన మీరు వెళ్లిపోండి అని అంటే చేసేదేమి లేక బిక్కు మొహం వేసుకొని ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ తంతు మొత్తం ప్రతి తాసిల్దార్ కార్యాలయాలలో, రెవిన్యూ డివిజనల్ కార్యాలయాలలోనే కాక... ఏకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా ఇదే పద్ధతి కొనసాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ గోడును కలెక్టర్ కు విన్నవించుకునేందుకు వచ్చిన బాధితులను అడ్డుకునే వారిపై జిల్లా కలెక్టర్ శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### గట్టువారన పైపులైను వేసుకొని దౌర్జన్యం

అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం సంజీపురం గ్రామానికి చెందిన బండి గారి రామకృష్ణారెడ్డి తండ్రి ఇరుకుల రెడ్డికి కడవకల్లు గ్రామ రెవెన్యూ పొలంలో ఎల్ పి ఎం నంబర్: 874, సర్వేనెంబర్ 308/బి లో 6.14 ఎకరాల పైకి 3.85 ఎకరాల పొలం ఉంది. అందులో భాగంగా 6.14 ఎకరాలలో ముగ్గురికి మూడు భాగాలుగా మొదటి వ్యక్తి మంజుల గంగన్నకు 1.62 ఎకరాలు, రెండవ వ్యక్తి బండి గారి రామకృష్ణారెడ్డికి 2.30 ఎకరాలు, మూడవ వ్యక్తి ఓబుల్ రెడ్డికి 2.30 ఎకరాల పొలం ఉంది. వీరి ముగ్గురికి గాను 6.14 ఎకరాల భూమిలో ఒక్కొక్కరుగా ఏళ్ల తరబడి సాగులో ఉన్నారు. అయితే వీరి తోట ప్రక్కనున్న ఈదల నాగేశ్వర్ రెడ్డి 20 అడుగుల పైపులైను గట్టువారన దాదాపుగా 80 పైపులతో పొడవుగా బండి రామకృష్ణ పొలంలో వేసుకున్నాడు. అందులో భాగంగా రీ సర్వే జరగగా ఆ పొలం బండి గారి రామకృష్ణ రైతుకు పడమర 61/2 అడుగుల వెడల్పుతో తూర్పుకు పోగా...1/2 అడుగుతో పొలం చివరన ముగిసింది. అయితే ఈ భూమిని మొత్తం సదరు రామకృష్ణకి రీసర్వే లో రాగా.. ఆర్డీఓ, మండల తహసిల్దార్ వారి దృష్టికి తీసుకువెళ్లగా సదరు బాధిత రైతుకి ఏ ఒక్క అధికారి కూడా న్యాయం చేయలేదన్నారు. 2020 సంవత్సరం నుంచి 2026 మార్చి వరకు దాదాపు ఆరు సంవత్సరాలు కాళ్లు అరిగేలా అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ కూడా తమ ముగ్గురికి కలిపి ఉన్న 6.14 ఎకరాల పైకి 3.85 ఎకరాలను సర్వే చేసి రామకృష్ణ భూమిలో నాగేశ్వర్ రెడ్డి వేసుకున్న పైపులైను తొలగించి, హద్దులను ఏర్పాటు చేసి తమ భూమిని అప్ప చెప్పాలని ఎండార్స్మెంట్ ఇచ్చినప్పటికీ కూడా ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు.

### ఆరేళ్లు గడిచినా 40 సెంట్ల భూమి సర్వే కాని వైనం

ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 20 రోజుల క్రితం నాగేశ్వర్ రెడ్డి దౌర్జన్యంగా తమ పొలంలో రాస్తా ఉన్న స్థలంలో అర్ధరాత్రిలో దారి పొడవునా గుట్టరాళ్లు వేసి తమకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే నెల 12న మండల తహసిల్దార్, పోలీసులు వచ్చి సర్ది చెప్పినప్పటికీ కూడా వారి మాటలను కాదని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు సర్వేకు రాకుండా..ఒకవేళ సర్వే చేయడానికి వచ్చినప్పటికీ .. సమగ్ర సర్వే చేయకుండా.. తూతూ మంత్రంగా సర్వే చేసి చేతులు దులిపేస్తున్నారు.అయితే కంది గోపుల గ్రామ సర్వేయర్ శ్రీనివాసులు రెడ్డి నిర్వాకంతోనే తాము తీవ్రంగా నష్టపోయని రైతు రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.సర్వే చేసి హద్దులు ఏర్పర్చినప్పటికీ కూడా.. తోట పక్కనున్న నాగేశ్వర్ రెడ్డి అరటి పంట వేయడంతో... పంట సాకుతో రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండా ఏళ్ల తరబడి నాన్చుతూ వస్తున్నారు. ఇదేమని అడిగితే.. అధికారులు మొత్తం ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. రామకృష్ణారెడ్డి రైతుకు రావలసిన భూమికి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంది. హద్దుల ఏర్పాటు చేయడానికి రెవెన్యూ అధికారులు నిరాకరించారు. దీంతో రైతు రామకృష్ణారెడ్డి సమస్యగానే మిగిలిపోయింది. సమస్య ఉన్న రెవిన్యూ భూముల్లో అధికారులు సర్వే చేయడానికి నిరాకరించడమే కాక.. సదరు ఈదల నాగేశ్వర్ రెడ్డికి రెవిన్యూ అధికారులు మొత్తం వత్తాసు పలుకుతున్నారు. దీంతో రామకృష్ణారెడ్డి దాదాపు 40 సెంట్ల పైకి నష్టపోవాల్సి వస్తోంది. దాదాపు ఆరేళ్ల నుంచి 40 సెంట్లు భూమి సమస్యగానే మిగిలిపోయి రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. అయితే సోమవారం నాగేశ్వర్రెడ్డి పొలం గట్టు పైన ఉన్న పైపులను తీసివేస్తానని తహసిల్దార్, ఎస్సై ల ముంగిట ఒప్పుకున్నప్పటికీ ఆ పైపులను తీసివేయకుండా కాలయాపన చేస్తున్నాడని రైతు రామకృష్ణారెడ్డి వాపోయారు. ఈదెల నాగేశ్వర్ రెడ్డి పొలంలో ఉన్న అరటి మొక్కలు పెరుగుతూనే ఉన్నాయి. వీటిని సాకు చూపి రెవిన్యూ అధికారులు రామకృష్ణారెడ్డి భూమిని సర్వే చేయకుండా ఏళ్ల తరబడి అతన్ని కార్యాలయాల చుట్టూ తిప్పుతూనే ఉన్నారు. రామకృష్ణారెడ్డి 40 సెంట్ల భూమి సర్వే చేయడానికి అధికారులకు ఆరు సంవత్సరాల కాలం పట్టింది. ఈ లెక్కన పదుల ఎకరాలలో ఉన్న రైతుల భూములు సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులకు మరి ఎన్ని సంవత్సరాలు కాలం పడుతుందో అర్థం కాని పరిస్థితి ఈ జిల్లాలో నెలకొంది. జిల్లా కలెక్టర్ రామకృష్ణారెడ్డి రైతుకు ఏ మేరకు న్యాయం చేస్తారనేది వేచి చూడాల్సిందే.

# సామాజిక న్యాయం కోసం పోరాడిన దొమ్మేటి వెంకటరెడ్డి స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల, బ్యూరో మార్చి 23 (రిపబ్లిక్ న్యూస్):** సామాజిక న్యాయం, విద్యా ప్రబోధం, అనగారిన వర్గాల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి గారి స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో దొమ్మేటి వెంకటరెడ్డి గారి 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, బీసీ కార్పొరేషన్ ఈడి జాకీర్ హుస్సేన్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి గారు శెట్టి బలిజ సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడిగా, ఆ వర్గం హక్కుల కోసం బ్రిటిష్ పాలన కాలంలోనే పోరాడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్య ప్రాధాన్యతను ఎంతో ముందుగానే గుర్తించిన వెంకటరెడ్డి గారు, ముఖ్యంగా వయోజన విద్యకు ప్రోత్సాహం ఇచ్చి ప్రతి ఇంటికి అక్షరాస్యతను తీసుకెళ్లేందుకు కృషి చేశారని తెలిపారు. సామాజిక చైతన్యం, హక్కుల కోసం పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపిన నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో, ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ సమన్వయంతో నిర్వహించినట్లు తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి గారు ప్రస్తుత కోనసీమ జిల్లాలోని బోడసకుర్రు గ్రామంలో జన్మించినట్లు గుర్తుచేసి, కోనసీమ ప్రాంతంలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బోడసకుర్రు – పాసర్లపూడి మధ్యనున్న వారధికి వెంకటరెడ్డి గారి పేరు పెట్టాలని స్థానికులు కోరుతున్నారని, ఆయనను శెట్టి బలిజ సమాజ పితామహుడిగా ప్రజలు గౌరవిస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయాలు, సేవా భావం భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

## వంద రోజుల క్యాంపెయిన్ ద్వారా విస్తృత అవగాహన

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో మార్చి 23 రిపబ్లిక్ న్యూస్:** క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేసి జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డిఎంహెచ్ఓ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల క్షయ (టిబి) వ్యాధి వస్తుందని తెలిపారు. ఈ బ్యాక్టీరియా ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తూ, శరీరంలోని ఇతర భాగాలపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల నోటి నుండి వచ్చే లాలాజలపు చుక్కల ద్వారా ఈ వ్యాధి సులభంగా వ్యాపిస్తుందని, దగ్గు, తుమ్ము, మాట్లాడటం, పాడటం వంటి సందర్భాల్లో ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుందని వివరించారు. అందువల్ల ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దగ్గు వచ్చినప్పుడు నోరు మూయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "క్షయ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం మరియు ఆరోగ్య శాఖ సంయుక్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వంద రోజుల ప్రత్యేక క్యాంపెయిన్ ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే, నిక్షయ పోషణ అభియాన్ కింద క్షయ రోగులకు పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 వరకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. క్షయ నిర్ధారణ కోసం ఛాతీ ఎక్స్-రే, శ్లేష్మ పరీక్ష వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 24న జరిగే ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని "జనభాగస్వామ్యంతో క్షయను అంతం చేద్దాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# మీ ఇంటికి మీ డాక్టర్

## మొబైల్ మెడికల్ యూనిట్ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల, బ్యూరోమార్చి 23 (రిపబ్లిక్ న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న "మీ ఇంటికి మీ డాక్టర్" వినూత్న ప్రాజెక్ట్‌లో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సోమవారం ప్రారంభించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ( ఆవరణలో సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు వారి ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మొబైల్ మెడికల్ యూనిట్ మార్చి నుండి మే 2026 వరకు నంద్యాల జిల్లాలోని బండి ఆత్మకూరు మండలంలోని 15 గ్రామాల్లో సేవలు అందించనుందన్నారు. "మీ ఇంటికి – మీ డాక్టర్" ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ( ఆర్ ఈ సి) లిమిటెడ్ సంస్థ సిఎస్ ఆర్ నిధుల సహకారంతో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం రూ.8.40 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ 01 మార్చి 2026 నుండి అమల్లోకి వచ్చి, మూడు సంవత్సరాల పాటు కొనసాగనుందన్నారు. ఈ ప్రాజెక్ట్ పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు (పాడేరు), నంద్యాల, పల్నాడు, తిరుపతి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అమలు చేస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం, శిశు మరణాల రేటు (ఐ ఎం ఆర్), మాతృ మరణాల రేటు (ఎం ఎం ఆర్) తగ్గించడం, అంటువ్యాధుల నియంత్రణ, 100% టీకాకరణ సాధించడం వంటి లక్ష్యాలతో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి మొబైల్ మెడికల్ యూనిట్‌లో ఒక వైద్యుడు, నర్సు, ఫార్మసిస్ట్, డ్రైవర్ ఉంటారని, వీరు గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలు, ఎస్సీ/ఎస్టీ కాలనీలు, పేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తారన్నారు. రోజుకు సుమారు 100 మందికి సేవలు అందించే ఈ యూనిట్, నెలకు 2000 మంది వరకు లబ్ధిదారులను చేరుకోగలదని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకు సుమారు 14,000 మంది, ఏడాదికి 2 లక్షల మంది, మూడు సంవత్సరాల్లో మొత్తం 6 లక్షల మందికి సేవలు అందించనున్నట్లు తెలిపారు. మార్చి నుండి మే 2026 వరకు వివిధ జిల్లాల్లోని ఎంపిక చేసిన మండలాల్లో ఈ ప్రాజెక్ట్ అమలు చేయబడుతుందని, ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక అమలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొంటూ, యువత స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో నివసించే పేదలకు ఉచిత వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సాంకేతిక నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అవసరానికి మించి బుకింగ్స్ చేయొద్దు

## జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత లేదు - ఆందోళన అవసరం లేదు

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరోమార్చి 23 రిపబ్లిక్ న్యూస్** జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు అనవసర ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం అనంతరం అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఇటీవలి అపోహల కారణంగా గ్యాస్ కొరత ఉందన్న ప్రచారం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని తెలిపారు. జిల్లాలో సాధారణంగా రోజుకు సుమారు 5,500 ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్స్ నమోదవుతుండగా, ప్రస్తుతం భయాందోళనల ప్రభావంతో ఆ సంఖ్య 10,000 వరకు పెరిగిందని పేర్కొన్నారు. అయితే సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, వినియోగదారులు అవసరానికి మించి బుకింగ్స్ చేయకుండా సహకరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇండక్షన్ స్టవ్‌ల లభ్యత, ధరలు తదితర వివరాలను సేకరించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ కనెక్షన్ల విషయంలో కొన్ని ప్రాంతాల్లో ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు సమర్పించిన నివేదికల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించామని క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి ఖచ్చితమైన వివరాలను సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు సరైన సమాచారం అందించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాల ద్వారా యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి**




**నంద్యాల, బ్యూరోమార్చి 23 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం, నంద్యాలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి 25న నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ షాదీ ఖానాలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, హెచ్‌క్యూహెచ్‌సీఎస్, యూనిసాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డీపీ చాక్లెట్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా రిడ్ ప్రైవేట్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, చోళమండలం గోల్డ్ లోన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్, జీపీఎస్ రెన్యువబుల్ ఎనర్జీ, అంబర్, వోల్టాస్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, బి/డి/ఎం ఫార్మసీ మరియు పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళా ద్వారా కనీసం 1500 ఉద్యోగాలను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎక్సైజ్ చట్టం ప్రకారం పునరావాసం పొందుతున్న విద్యార్థులు కూడా జాబ్ మేళాలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సూచించారు. జాబ్ మేళాకు సంబంధించిన వివరాల కోసం 9182217075, 8297812530 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని, లేదా నైపుణ్యం వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి కళ్యాణి, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించండి

## పిజిఆర్ఎస్ ద్వారా 206 దరఖాస్తుల స్వీకరణ

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 121 దరఖాస్తుల స్వీకరణ -జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా





**నంద్యాల, బ్యూరోమార్చి, 23 (రిపబ్లిక్ న్యూస్):** ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించి ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డిఆర్ఓ రామునాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూస్తూ ఉండాలని పలుమార్లు ఆదేశించినప్పటికీ ఇంకా 104 దరఖాస్తులు ఓపెన్ చేసి చూడకపోవడం విచారకరమన్నారు. రీఓపెన్ దరఖాస్తులకు సంబంధించి ఇంకా 305 దరఖాస్తులు రీఓపెన్ చేయడం జరిగిందని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటికి తొలి ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 121 అర్జీల స్వీకరణ**

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 121 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 9, అడంగల్ సవరణలకు సంబంధించినవి 24, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22–ఎ భూములకు సంబంధించినవి 12, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 29, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 14, సర్వే, రీ–సర్వేలకు సంబంధించినవి 30, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 3 గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

ల1) సిరివెళ్ల మండలం, ఎర్రగుంట్ల గ్రామంలో రహదారి నిర్మాణం కోసం స్థలం కేటాయించడం జరిగిందని, అందులో సగభాగం రోడ్డు కూడా నిర్మించడం జరిగిందని మిగతా రోడ్డు నిర్మాణ సమయంలో సదరు రహదారి నిర్మాణానికి కేటాయించిన భూమి తమదని నిర్మాణం జరగకుండా కంపచెట్లు అడ్డుగా వేయడం జరిగిందని, సదరు అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సిరివెళ్ల తహశీల్దార్, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు.

2) బనగానపల్లె గ్రామం, పెరుసోమల గ్రామానికి చెందిన రాహుల్ పవర్ గ్రిడ్ సంస్థ వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారని జిల్లా కలెక్టర్ అర్జీ సమర్పించగా అందుకు సంబంధించిన అనుమతులను పరిశీలించడంతో పాటు నష్టపరిహారం కోసం కూడా ఎక్కువ శాతం రైతులు దరఖాస్తు చేసుకోవడం జరుగుతోందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని బనగానపల్లె ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.

3) నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన జి.పద్మావతి తనకు పిఎం కిసాన్ పథకం క్రింద జమ కావాల్సిన నగదు జమ కాలేదని అందుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com